క్లుప్తంగా

'సీఐటీయూ ముసుగులో అక్రమాలు'

ఆసిఫాబాద్అర్బన్: సీఐటీయూ ముసుగులో జిల్లాకు చెందిన పలువురు నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఇటీవల యూనియన్ నుంచి బహిష్కరణకు గురైన అల్లూరి లోకేశ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు న్యాయం జరగాలంటే శ్రీనివాస్, త్రివేణి, రాజేందర్‌పై బహిష్కరణ వేటు వేయాలని డిమాండ్ చేశారు. తనపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో శంకర్, సురేశ్, సోమయ్య, సంతోష్, దివాకర్, నగేష్, ఆత్మారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు మధుకర్

లక్సెట్టిపేట: రైతులు సహకార సంఘ వ్యాపారాభివృద్ధికి కృషి చేయాలని సొసైటీ అధ్యక్షుడు మధుకర్ అన్నారు. మండలంలోని చందారంలో రైతు పొదుపు పరపతి మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన 70వ అఖిల భారత సహకార వారోత్సవాల వేడుకల సమావేశంలో మాట్లాడారు. జెండా ఎగురవేసి సంబురాలు చేసుకున్నారు. రైతుల సొసైటీ ఆధ్వర్యంలో అందించే సహకారాలను వినియోగించుకోవాలని తెలిపారు. 'సహకార సంఘం వ్యాపారాభివృద్ధి' అనే అంశం మీద సభ్యులకు అవగాహన కల్పించి చర్చించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు చిన్నన్న, లక్ష్మారెడ్డి, ఎల్లయ్య, రాజేష్, సీఈవో వినోద్ రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్: చెన్నూర్‌తోపాటు మరో మూడు మండలాల్లో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. మంథని నుంచి చెన్నూర్‌కు సరఫరా అయ్యే 132కేవీ లైన్ మరమ్మతుల కారణంగా చెన్నూర్, భీమారం, కోటపల్లి, వేమనపల్లి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

ఓపెన్ ప్రవేశాలకు గడువు పెంపు

దండేపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో 2023–24 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకు ఈ నెల 30వరకు గడువు పెంచినట్లు దండేపల్లి ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శంకర్‌గౌడ్, సహాయ కో ఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 13తోనే ప్రవేశాలు ముగిసినప్పటికీ, స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 30వరకు మళ్లీ గడువు పొడగించినట్లు పేర్కొన్నారు. ఇంకా ప్రవేశం పొందని వారుంటే, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించ వచ్చన్నారు.

ఓటర్ స్లిప్‌తో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరి



బీఎల్‌వోలకు స్లిప్‌లు అందజేస్తున్న తహసీల్దార్

జన్నారం: ఈ నెల 30 జరిగే అసెంబ్లీ ఎన్నికలలో ఓటు వేసే ఓటర్లు ఓటరు స్లిప్‌తో పాటు 12రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తీసుకెళ్లాలని, ఈ విషయాన్ని ఓటర్లకు చేరవేసేలా చూడాలని తహసీల్దార్ వేణుగోపాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌వోలకు సమావేశం ఏర్పాటు చేసి, ఓటర్ స్లిప్పులను అందజేశారు. ఈ స్లిప్‌లను ప్రతి ఓటరుకు చేరేలా చూడాలన్నారు. ఓటరు స్లిప్‌ను తప్పనిసరిగా పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేలా చూడాలన్నారు. ప్రతిఇంటికీ ఓటర్ గైడ్ ఇవ్వాలన్నారు. ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడితే సీ విజిల్ ఆప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో డీటీ రామ్మోహన్, ఆర్ఐ భానుచందర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మందమర్రిలో ఉద్యమకారుల సమ్మేళనం

మందమర్రిరూరల్: పట్టణంలోని రామకృష్ణపూర్ రోడ్డులో గల శ్రీమంజునాథ ఫంక్షన్ హాల్లో శనివారం సాయంత్రం 4గంటలకు తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని తెలంగాణ విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెరిగిన ఇంధన ధరలు.. తగ్గిన ఆదాయం

- ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ రుణాలు అందించాలి
- 'సాక్షి'తో సిర్పూర్ నియోజకవర్గ ఆటో డ్రైవర్లు



కౌటాలలో ఆటో డ్రైవర్లు

కౌటాల(సిర్పూర్): ఆటోను జీవనాధారంగా చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న తమ పరిస్థితి పెరిగిన ఇంధన ధరలతో దయనీయంగా మారిందని ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. అప్పులు చేసి మరీ ఆటోలు కొని నడుపుతుంటే రోజువారి కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. ఆటోలు నడపడం ద్వారా వచ్చిన అరకొర డబ్బులు డీజిల్‌కే పోతున్నాయని, నెల వచ్చే సరికి తీసుకున్న ఫైనాన్స్ కూడా కట్టలేకపోతున్నామంటున్నారు. సిర్పూర్ నియోజకవర్గం పరిధిలోని కౌటాల, సిర్పూర్(టి), బెజ్జూర్, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్ ప్రాంతాల నుంచి సుమారు 500 వరకు ఆటోలు ప్రతీరోజు కౌటాల మండల కేంద్రం నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. బస్సులు లేనప్పుడు ప్రయాణికులు ఆటోలపైనే ఆధారపడి గమ్య స్థానాలకు చేరుతుంటారు. ఆర్టీసీ బస్సు సేవలు లేని గ్రామాలకు ఆటోలే ఆధారం. అయితే ఆటోలు నడిపే వారి పరిస్థితి మాత్రం అంతా ఆశాజనకంగా లేదని వారు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రజా ఎజెండాలో భాగంగా 'సాక్షి' కౌటాల మండల కేంద్రంలోని ఆటో డ్రైవర్లను పలకరించగా వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

రుణాలు అందించాలి



నేను గత 15 ఏళ్లుగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. ప్రస్తుతం అమాంతంగా పెరిగిన బీమా ధరలు, ఎఫ్‌సీ కాలం ముగిసిన తరువాత వేసే అపరాధ రుసుం ఆటో డ్రైవర్ల జీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందించి ఆటో డ్రైవర్లకు ఆదుకోవాలి.

– పోర్ల ప్రభాకర్, బోదంపల్లి

ఆటోస్టాండ్‌లు ఏర్పాటు చేయాలి



కౌటాల మండల కేంద్రానికి ప్రతీరోజు వందల ఆటోలు వస్తుంటాయి. కానీ ఆటోలను నిలపడానికి ప్రత్యేక స్థలం లేదు. దీంతో దుకాణాల ఎదుట పార్కింగ్ చేస్తున్నాం. దుకాణదారులు ఆటోలను పార్కింగ్ చేయవద్దంటున్నారు. ప్రతీ మండల కేంద్రంలో ఆటోస్టాండ్‌లు ఏర్పాటు చేయాలి. ఆటో డ్రైవర్ల కోసం ఆటో నగరాలు నిర్మించాలి.

– హరిదాస్, ఆటో సంఘం మండలాధ్యక్షుడు, కౌటాల

ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి



అసలే గిరాకీలు లేక రోజంతా ఉంటున్న ఆటో డ్రైవర్లకు పోలీసుల చలాన్లతో ఇబ్బందులు పడుతున్నాం. యాక్సిడెంటల్ బీమా రూ.5 లక్షలను సాధారణ మరణాలు, అంగవైల్యానికి సైతం వర్తింపజేయాలి. ఆటో బీమా ప్రీమియం తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలి.

– కుమ్మరి సాయినాథ్, కౌటాల

గిరాకీలు లేవు



ఆటో నడిపితే వచ్చే డబ్బులతో ఆటోలకు సర్వీసింగ్ కూడా చేయలేని పరిస్థితి వచ్చింది. దీనికి తోడు ప్రస్తుతం దాదాపు ప్రతీ ఇంటికి ద్విచక్ర వాహనాలు ఉండడంతో గతంలో కంటే ప్రస్తుతం సొంత వాహనాలనే ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆటోలకు గిరాకీలు ఉండడం లేదు.

– నక్క జనార్దన్, దబ్బా, చింతలమానెపల్లి

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి



అప్పులు చేసి మరీ ఆటోలు కొనుగోలు చేశాం. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలి. ఆటో డ్రైవర్లకు హెల్త్ కార్డులు అందించాలి.

– గోగర్ల సుగుణాకర్, తలోడి

భారంగా కుటుంబ పోషణ



గత 18 ఏళ్ల నుంచి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నా. డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు గతంలో మాదిరి ప్రస్తుతం ఆటోలకు గిరాకీలు ఉండడం లేదు. ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే కాపాడాలి. ఆర్థికంగా సాయం చేయాలి.

– శ్రీనివాస్‌గౌడ్, బాలాజీఅనుకోడ, చింతలమానెపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



రోజంతా కష్టపడి ఆటో నడిపినా వచ్చిన డబ్బులు నిత్యావసర సరుకులకు కూడా సరిపోవడం లేదు. అప్పులు చేసి ఆటోలు కొని డబ్బు సంపాదిద్దామని ఆశపడితే, ప్రస్తుతం పెరిగిన బీమా, రోడ్డు టాక్స్‌లతో ఆటోలు నడపలేకపోతున్నాం. ఏం చేయాలో తోచడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– శ్రీనివాస్, రుద్రాపూర్, చింతలమానెపల్లి

గిట్టుబాటు కావడం లేదు



గతంలో ఆటోలపైనే ఆధారపడి ప్రయాణాలు చేసేవారు. ప్రస్తుతం ఇతర వాహనాలు పెరిగాయి. దీంతో గిరాకీలు లేక ఖాళీగా ఉంటున్నాం. ఆటోలకు గిట్టుబాటు కావడం లేదు. సరైన ఆదాయం రాకపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి.

– వడాయి నగేశ్, కన్నెపల్లి

జగనన్న మాదిరిగా..



ఆంధ్రప్రదేశ్‌లో ఆటో డ్రైవర్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదుకుంటున్న రీతిలో తెలంగాణలోనూ ఆటో డ్రైవర్లను కేసీఆర్ ప్రభుత్వం ఆదుకోవాలి. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.20 వేలు అందించాలి. ఆటో డ్రైవర్లకు ప్రమాదాలు జరిగితే ఆర్థికంగా ఆదుకోవాలి.

– రాంటెంకి శివరాం, బోదంపల్లి

ఆటోలు అధికంగా..



నేను 14 ఏళ్లుగా ఆటో నడుపుతున్న. అప్పట్లో మొత్తం కలిపితే 50 ఆటోలు ఉండేవి. రోజుకు డీజిల్ పోనూ రూ. 100 వచ్చినా కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండే. కానీ ప్రస్తుతం పరిస్థితులు మారాయి. కౌటాలకు రోజుకు వందల ఆటోలు వస్తున్నాయి. పిల్లల చదువులు, పెరిగిన ధరలతో కుటుంబ పోషణ భారంగా మారింది.

– దాగం గంతీదాస్, కౌటాల

గుండెపోటుతో వార్డు సభ్యుడు మృతి



మల్కరి ప్రసాద్ (ఫైల్)

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ 1వ నంబర్ వార్డు సభ్యుడు మల్కరి ప్రసాద్(40) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ప్రసాద్ నాలుగు రోజుల క్రితం ఇంటి వద్ద తీవ్ర అస్వస్థతకు గురికాగా హుటాహుటిన మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మండల పూజ

మందమర్రిరూరల్: పట్టణంలోని హరిహర స్వామి దేవాలయంలో ఆలయ నిర్వాహకులు శుక్రవారం అయ్యప్ప మండల పూజ ఘనంగా నిర్వహించారు. గణపతి హోమం అయ్యప్ప స్వామి ఆరాధన చేపట్టారు. అనంతరం భక్తులకు సహపంక్తి భోజనం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'బీసీలను విస్మరించిన ప్రధాన పార్టీలు'

చెన్నూర్: రాష్ట్రంలో 50 శాతం ఉన్న బీసీలను ప్రధాన పార్టీలు విస్మరించాయని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది జేక సంజీవ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ పార్టీలు బీసీ వర్గాలకు మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, బీసీల బతుకులు మారలేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రధాన పార్టీలు బీసీలను ఓటర్ల యంత్రాలుగానే వాడుకుంటున్నారని పేర్కొన్నారు. బీసీ ఓటర్లపై పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయిస్తామని ప్రకటించాలన్నారు. బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన పార్టీలకే మా మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం యువజన సంఘం నాయకులు అన్నల మల్లేశ్, శ్రీనివాస్, శేఖర్, సాయికిరణ్, సతీశ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

'తొలిమెట్టు' పూర్తిస్థాయిలో అమలు చేయాలి

కాసిపేట: తొలిమెట్టు కార్యక్రమం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని కాసిపేట జిల్లాపరిషత్ పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులకు వారి తరగతులకు సంబంధించిన అభ్యసన సామర్థ్యాలు బోధించాలని, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి లచ్చయ్య, కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి, రమేశ్ రాథోడ్, సుధాకర్ నాయక్, మండలంలోని ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

'ఉన్నతి' లక్ష్యాలు నెరవేర్చాలి



దండేపల్లి: మాట్లాడుతున్న విద్యాసాగర్

దండేపల్లి: ఉన్నతి లక్ష్యాలను నెరవేర్చి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని, భౌతిక శాస్త్ర విషయ పరిశీలకుడు విద్యాసాగర్ అన్నారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడారు. పాఠ్య ప్రణాళికలు, టీచర్ డైరీలు నిర్వహించి తదనుగుణంగా బోధన చేయాలన్నారు. అనంతరం ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన రమేష్, రాజయ్య, రాజేశ్వర్‌రావులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రవీందర్, మండల నోడల్ అధికారి చిన్నయ్య, కాంప్లెక్స్ కో ఆర్డినేటర్ మనోహర్, సీఆర్పీ నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వైశ్య భవన్‌లో శుక్రవారం ఉచిత వాస్క్యులర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వాస్క్యులర్ ఆసుపత్రికి చెందిన వైద్యులు ప్రవీణ్ కుమార్, డాక్టర్ భార్గవ్, డాక్టర్ సోమాచారి, మార్కెటింగ్ ఆఫీసర్ హరిప్రకాశ్ 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు.

కానరాని పత్తి దిగుబడి

- సకాలంలో కురవని వర్షాలు
- ఆందోళనలో రైతులు



సిర్పూర్(టి) మండలంలో ఇంకా పూతదశలోనే పత్తి పంట

సిర్పూర్(టి): సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పత్తి పంట దిగుబడి కానరావడం లేదు. సిర్పూర్(టి) పరిసర ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో సైతం వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు కురిసినప్పటికీ సెప్టెంబర్, అక్టోబర్‌లలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. దీంతో పత్తి పంటతో పాటు కంది, వరి పంటలు సైతం దిగుబడి తగ్గిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ సంవత్సరం ఈ సమయానికి పత్తితీత పనులు జరిగేవని, కానీ ఈసారి పత్తి ఏరేందుకు ఇంకా చాలా సమయం పట్టేలా ఉందని పేర్కొంటున్నారు.

మండలంలో..

మండలంలో పత్తి పంట సుమారు 15వేల ఎకరాల వరకు, వరి పంట 4వేల నుంచి 5వేల ఎకరాలు, మిర్చి పంట 200 ఎకరాల వరకు సాగు చేస్తుండగా, అంతరపంటగా కంది పంటను 1000 ఎకరాల వరకు సాగు చేశారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ప్రధానంగా పత్తి పంట రైతులు ఆశించినంత దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

సకాలంలో వర్షాలు పడలేదు



సీజన్ ప్రారంభంలో వర్షాలు కురిసినప్పటికీ సెప్టెంబర్, అక్టోబర్‌లలో వర్షాలు పడక పత్తి పంట దిగుబడి తగ్గే అవకాశం కన్పిస్తుంది. సకాలంలో వర్షాలు కురువకపోవడంతో పత్తి సాగు చేసిన రైతులం తీవ్రంగా ఆందోళన చెందుతున్నాం.

– తుస్సే సుధాకర్, రైతు

ఆశించిన స్థాయిలో దిగుబడి లేదు



వర్షాలు సకాలంలో కురువకపోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. ప్రతీ సంవత్సరం ఈ సమయానికి పత్తితీత పనులు జరిగేవి. కానీ ఈ ఏడాది పత్తి ఏరడానికి ఇంకా సమయం పట్టేలా ఉంది. చెట్టుకు కాయలు కూడా తక్కువగా ఉన్నాయి.

– ఎల్ములే మోతిరాం, రైతు

అధ్వానంగా రోడ్లు.. తప్పని పాట్లు

- పట్టించుకోని పాలకులు, అధికారులు
- సమస్యలు పరిష్కరించాలని ప్రజల వేడుకోలు



గోడవెల్లిలో గుంతలతో ఉన్న మట్టిరోడ్డు



బండరాళ్లతో నిండిన దేవదుర్గం రోడ్డు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే కచ్చా రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలం బురద, ఎండాకాలం దుమ్ము, రోడ్డుపై పెద్ద గుంతలతో అష్టకష్టాలు పడుతున్నారు. స్వాతంత్య్రం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు చాలా గ్రామాలకు మట్టి రోడ్లే దర్శనం ఇస్తున్నాయి. అధికారులు, పాలకులు మారిన కష్టాలు తీరడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అప్పపల్లి, గోడవెల్లి, సింగరావుపేట్, పాడిబండ, దేవదుర్గంతో పాటు చాలా గ్రామాలకు తారురోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు సౌకర్యం కోసం దశాబ్దాల కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

ప్రజాప్రతినిధులకు ఎన్నికలప్పుడే ఊరు గుర్తుకొస్తుంది. తరువాత మా ఊరు సమస్యలను మరిచిపోతున్నారు. వాగుపై వంతెన లేకపోవడంతో వానాకాలం చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– సాంబయ్య, అప్పపల్లి

తీవ్ర ఇబ్బందులు..

మండలంలోని ఆయా గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి, ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ఎడ్లబండ్లు, కాలినడకతోనే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆయా గ్రామాల నుంచి ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం, రైతులు, రోజువారి కూలీలు వివిధ పనుల నిమిత్తం నిత్యం జిల్లా కేంద్రానికి వెళ్తుంటారు. కానీ రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని వారు వాపోతున్నారు.

కాలినడకే దిక్కు

మా గ్రామానికి నేటికీ రోడ్డు లేదు. కాలినడకతోనే ఏడు కిలోమీటర్లు వెళ్తున్నాం. అత్యవసర సమయాల్లో కూడా మా ఊరికి ఎలాంటి వాహనాలు రాలేని పరిస్థితి ఉంది. ఎవరైనా నడిచి రావాల్సిందే.

– టేకం గుండయ్య

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



ఐనం గ్రామంలో నగర సంకీర్తనలో భక్తులు

దహెగాం: కార్తీకమాసం ప్రారంభమైనప్పటి నుంచి మండలంలోని ఐనం, గెర్రె తదితర గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఐనం గ్రామంలో ప్రతీరోజు భక్తులు నగర సంకీర్తన చేపడుతున్నారు. వీధుల గుండా భజన పాటలు పాడుతూ ఊరేగింపు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని శివ పంచాయత అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కాగడ హారతి కొనసాగుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల శక్తిసామర్థ్యాలు వెలికితీయాలి

తాండూర్: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీయాలని ఎంఈవో ప్రభాకర్ అన్నారు. తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఈయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల శక్తి సామర్థ్యాలను వెలికి తీయడం వల్ల చదువులో ఉన్నతంగా రాణించడానికి అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో మండల నోడల్ అధికారి మల్లేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయప్రకాష్ పాల్గొన్నారు.

సరుకులు అందజేత

దండేపల్లి: మండలంలోని నంబాల గ్రామానికి చెందిన నిరుపేద రవళి, శ్రీలత కుటుంబాలకు నంబాల సేవ సమితి, లక్సెట్టిపేట శివ సాయి గణేష్ సేవా సమితిల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు శుక్రవారం అందించారు.